139) నాట

ప॥ అహోబలేశ్వరు డరికులదమనుడు । మహామహిమలను మలసీ నాడె ॥

చ॥ కదలుగన్నులును కరాళవదనము । గుదిగొనుభయదపుగోరలను ।
అదరుమీసములు నలరగ నవ్వుచు । వుదుటతోడ గొలువున్నాడు వాడె ॥

చ॥ అతిసితనఖములు ననంతభుజములు । వితతపరాక్రమవేషమును ।
అతులదీర్ఘ జిహ్వాయు గడు మెరయగ । మితిలేనికరుణ మెరసీ వాడే ॥

చ॥ సందడిసొమ్ములు శంఖచక్రములు । పొందుగ దివిజులు పొగడగను ।
యిందిర దొడ్పై నిడి శ్రీవేంకట- । మందు నిందు గడు నలరీ వాడే ॥